సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 29 । జూలై । 2025



యాదగిరి క్షేత్రంలో తగ్గిన భక్తులు
యాదగిరి క్షేత్రానికి భక్తుల రాక తగ్గింది. ఎప్పుడు భక్తులతో కిటకిటలాడే ఆలయం సోమవారం వెలవెలబోయింది. - 8లో



నవనీత.. సాగులో ఘనత
తుర్కపల్లి మండలం గొల్లగూడేనికి చెందిన వంగాల నవనీత ఐదేళ్లుగా వివిధ రకాల పంటల సాగులో రాణిస్తోంది. - 8లో



వసతిగృహాల్లో తనిఖీలు
జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల్లో సోమవారం అధికారులు తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు ఎంజీయూకు విద్యాకమిషన్ బృందం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి మంగళవారం విద్యాకమిషన్ బృందం రానుంది. కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీతో పాటు సభ్యులు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, కె.జోష్న శివారెడ్డి ఎంజీయూను సందర్శించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సెమినార్ హాల్‌లో యూనివర్సిటీ అధ్యాపకులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అఫ్లిలేటెడ్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలతో కమిషన్ బృందం సమావేశం కానున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి తెలిపారు. విద్యా అంశాలపై చర్చించనున్నారని వెల్లడించారు.

గుజరాత్ నుంచి బ్యాలెట్ బాక్సులు

సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థల ఎన్నికల కోసం గుజరాత్ నుంచి 1,260 బ్యాలెట్ బాక్సులను తెప్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 1,650 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. కాగా ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అదనంగా బ్యాలెట్ బాక్సులను తెప్పిస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



త్యాగరాజును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజాపేట: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాజాపేట మండలంలోని దూదివెంకటాపురం పాఠశాల విద్యార్థి త్యాగరాజు ప్రభుదాసు ఎంపికయ్యారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో త్యాగరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 60 మీటర్ల పరుగులో, లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఆగస్టు 7న జనగామ జిల్లా ధర్మకంచ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో త్యాగరాజు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలి పారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

31న స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశాలు అడ్మిషన్ పొందడానికి పదో తరగతిలో 420 మార్కుల కంటే ఎక్కువ వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ టీసీ, మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ ఫొటోలతో నేరుగా కళాశాలలో హాజరు కావాలని కోరారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఎంపిక జాబితా ప్రకటిస్తామన్నారు.

ఏటీసీని సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరిటౌన్ : ఆలేరులో ఐటీఐలో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఏటీసీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లా యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఏటీసీ దోహదపడుతుందన్నారు. ఐటీఐ కన్వీనర్ హరికృష్ణ మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ మరియు వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9866843920 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

30న జాబ్‌మేళా

నల్లగొండ : నిరుద్యోగ యువతీ, యువకులకు పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి ఏదేని డిగ్రీ, డిప్లొమా(అగ్రికల్చర్, హార్టికల్చర్) ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు వారి ఒరిజినల్స్, బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 7893420435ను సంప్రదించాలన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



భువనగిరిలోని ప్రిన్స్‌చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

భువనగిరి: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం వివిధ కళాశాలల విద్యార్థులు భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, కన్వీనర్ పల్లగొర్ల మోదిరాందేవ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రూ.8వేల కోట్లు పెండింగ్ ఉందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందు విద్యార్థులు భారా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, బట్టు రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం హాయిగా..

రూ.161.48 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి

- హ్యామ్ విధానంలో చేపట్టనున్న ప్రభుత్వం
- పనులకు త్వరలో టెండర్లు
- మారనున్న పట్టణ, గ్రామీణ రహదారుల రూపురేఖలు

సాక్షి, యాదాద్రి: ఛిద్రమైన రోడ్లతో నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులకు ఊరట లభించనుంది. ఆర్‌అండ్‌బీ రహదారుల ఉన్నతీకరణ కోసం ప్రత్యేక ప్యాకేజీలో జిల్లాకు ప్రభుత్వం రూ.161.48 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో సింగిల్ రోడ్లను డబుల్ లేన్‌గా, డబుల్ రోడ్లను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు కల్వర్టులు, వంతెనలు, డివైడర్ల నిర్మాణం, ప్రమాదాల నివారణకు మూలమలుపుల వద్ద సైడ్‌వాల్స్, స్పీడ్ బ్రేకర్లు తదితర చర్యలు చేపట్టనున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్) విధానంలో పనులు చేపట్టనున్నారు.

అభివృద్ధి చేయనున్న రోడ్లు, కేటాయించిన నిధులు

- తుర్కపల్లి నుంచి బొమ్మలరామారం మండలం రంగాపూర్ వరకు రహదారిని రూ.17.18 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. వయా మల్కాపూర్, బద్దుతండా, మాదాపూర్, రామస్వామితండా, చీకటిమామిడి, కాజీపేట, బొమ్మలరామారం మీదుగా రంగాపూర్ వరకు రోడ్డును అభివృద్ధి చేస్తారు. పనులు పూర్తయితే యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లి మీదుగా హైదరాబాద్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రయాణం సులభతరం కానుంది.
- నాగారం నుంచి వయా ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, నెమలి కాల్వ గ్రామాల మీదుగా చౌటుప్పల్ వరకు రూ. 6.50 కోట్లు మంజూరయ్యాయి.
- ఆలేరు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జగ్‌దేవ్‌పూర్ పీడబ్ల్యూడీ రహదారి వరకు వయా రఘునాథపురం, చల్లూరు, ఇబ్రహీంపూర్, వీరారెడ్డిపల్లి వరకు రూ.28.20 కోట్లతో డబుల్ లేన్‌గా విస్తరించనున్నారు.తద్వారా మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాలకు ప్రయాణం సులువుకానుంది.
- ఆలేరు నుంచి వయా సాయిగూడెం, కొల్లూరు, శారాజీపేట, జనగామ జిల్లా జీడికల్ రోడ్డు వరకు రూ.12.50 కోట్లతో పనులు చేపట్టనున్నారు.
- ఆలేరు నుంచి మోత్కూరు వరకు ఉన్న డబుల్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.డివైడర్లు రానున్నాయి.
- జనగామ జిల్లా జీడికల్ రోడ్డునుంచి మోత్కూరు వరకు వయా అనంతారం, సుద్దాల, బ్రాహ్మణపల్లి, రామారం, గుండాల మండల కేంద్రం, నుంచి మోత్కూరు వరకు రూ.26 కోట్లు.
- రాయగిరి–మోత్కూరు రోడ్డు నుంచి బండసోమారం,చందుపట్ల మీదుగా భువనగిరి - చిట్యాల రోడ్డు వరకు రూ.15.50 కోట్లు.



డివైడర్ రానున్న చౌటుప్పల్ - నాగారం రోడ్డు



డబుల్ లేన్‌గా మారనున్న రఘునాథపురం-చల్లూరు రోడ్డు

- భువనగిరి – చిట్యాల రోడ్డుకు భువనగిరి నియోజకవర్గ పరిధిలో రూ.28 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భువనగిరి, నాగిరెడ్డిపల్లి, టేకులసోమారం, వలిగొండ, నాగారం, తుమ్మలగూడెం, బోగారం, రామన్నపేట వరకు రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ఇదే రహదారికి నకిరేకల్ నియోజవర్గ పరిధిలో రూ.15.60 కోట్లు కేటాయించారు. ఈ మార్గం యాదాద్రి, నల్లగొండ జిల్లాల పరిధిలో జాతీయ రహదారుల తరువాత అత్యంత రద్దీగా ఉంటుంది. దక్షిణ–ఉత్తర భారతదేశం మధ్య వివిధ ప్రాంతాలకు ప్రధాన వారధి. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రహదారి అభివృద్ధి జరిగితే ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తక్కువ వ్యవధిలో వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.



తుర్కపల్లి మండలం మల్కాపురం వద్ద ప్రమాదకరంగా మూల మలుపులు

- మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ నుంచి వలిగొండ మండలం నాగారం వరకు.. వయా ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, వలిగొండ మండలం జాలుకాలువ, నెమిల కాల్వ గ్రామం వరకు రూ.12 కోట్ల మంజూరయ్యాయి. చౌటుప్పల్ నుంచి వలిగొండ మీదుగా భువనగిరి వరకు ప్రధాన రహదారి ఇది. నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉంది.

ప్రజావాణికి వినతుల వెల్లువ



దరఖాస్తుదారుల సమస్య ఆలకిస్తున్న అధికారులు

- అధికంగా భూ సమస్యలపైనే..
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు, అధికారులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు.. సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజావాణిలో మొత్తం 81 అర్జీలు స్వీకరించామని, అందులో 59 దరఖాస్తులు భూ సమస్యలకు సంబంధించినవేనని అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు తెలిపారు. దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ శోభారాణి, హౌసింగ్ పీడీ విజయసింగ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాట కబ్జా చేశారని ఫిర్యాదు



బావుల వద్దకు వెళ్లే బాటను కొందరు వ్యక్తులు కబ్జా చేశారని భువనగిరి మండలం యర్రంబెల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 119,95లో తాతల కాలం నుంచి ఉన్న నక్షదారిని ఆక్రమించడంతో సుమారు 30 మంది రైతులం ఇబ్బంది పడుతున్నామని, ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ నెల 27న ఒక వ్యక్తి మృతిచెందగా బునాదిగాని కాలువ పక్కనుంచి చుట్టూ తిరిగి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, రికార్డుల ప్రకారం బాట చూపించాలని కోరారు.

మాకు ఇళ్లు కావాలే..

మా ఇళ్లు ఎప్పుడో కట్టినవి.. భారీ వర్షాలు కురుస్తే కూలిపోయే స్థితిలో ఉన్నాయి.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు అదనపు కలెక్టర్లను వేడుకున్నారు. ఇళ్లు శిథిలావస్థలో ఉండటంతో ప్రస్తుతం కొందరం గుడిసెలో, కమ్యూనిటీ హాల్‌లో, మరికొందరం కిరాయికి ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు కూడా తమ సమస్య తెలియజేశామన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారికి అనుకూలంగా ఉన్న వారికే ఇళ్లు మంజూరు చేశారని, ఎల్–1 జాబితాలో మా పేర్లు ఉన్నందున తమకు కూడా వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని వేడుకున్నారు.



నేడు ముగ్గురు మంత్రుల రాక

- ఆలేరు, పోచంపల్లిలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ

సాక్షి,యాదాద్రి : జిల్లాకు బుధవారం ముగ్గురు రాష్ట్ర మంత్రులు రానున్నారు. జిల్లా ఇంచార్జ్, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3.45 గంటలకు భూదాన్‌పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో, సాయంత్రం 5గంటలకు ఆలేరులోని దినేష్ గార్డెన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. మంత్రులతో పాటు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.కలెక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

12 కౌంటర్లకు ఆరుగురే..!

- గూడూరు టోల్‌ప్లాజాలో సిబ్బంది కొరత
- వాహనాల రద్దీ ఉన్నప్పుడు ఒక బూత్ నుంచి మరో కౌంటర్‌కు షిఫ్ట్
- తరచూ ట్రాఫిక్‌జామ్, వాహనదారుల అవస్థలు

బీబీనగర్ : హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి మార్గంలోని బీబీనగర్ మండలం గూడూరు పరిధిలో గల టోల్‌ప్లాజాలో సరిపడా సిబ్బంది లేక వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టోల్‌ప్లాజాలో హైదరాబాద్ వైపు 6, వరంగల్ వైపు 6 బూత్‌లు ఉన్నాయి. మొత్తం 12 కౌంటర్లలో ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో వాహనాలు వచ్చినప్పుడు ఒక కౌంటర్ నుంచి మరో కౌంటర్‌కు సిబ్బంది షిఫ్ట్ అవుతున్న క్రమంలో వాహనాలు బారులుదీరుతున్నాయి.

గతంలోనే సిబ్బంది కుదింపు

ఫాస్టాగ్ విధానం వల్ల గతంలోనే టోల్‌ప్లాజా అధికారులు సిబ్బందిని కుదించారు. సాంకేతిక సమస్యలతో ఫాస్టాగ్ స్కాన్ కాకపోవడం, ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోవడం వంటి కారణాలతో వాహనదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అన్ని బూత్‌లలో సిబ్బంది లేరు. దీంతో వాహనదారులు రివర్స్ తీసుకొని సిబ్బంది ఉన్న కౌంటర్లగుండా వెళ్లి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాలు ఆలస్యంగా కదులుతుండడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. 12 కౌంటర్లలో సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేస్తే సమస్య ఉండదనివాహనదారులు అంటున్నారు.



హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కౌంటర్

అన్నదాతకు యంత్ర సాయం

- రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు
- జిల్లాకు 1,701 యూనిట్లు కేటాయింపు
- ఆగస్టు 15లోపు లబ్ధిదారుల ఆమోదం

రామన్నపేట: అన్నదాతకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందనున్నాయి. 2025–25 సంవత్సరానికి గాను జిల్లాకు 1,701 యూనిట్‌లు మంజూరయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,27,44,664 కేటాయించింది. చిన్న, సన్నకారు రైతులు, విద్యుత్ లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో యాంత్రీకరణ పెంచడం, తక్కువ భూవిస్తీర్ణం కలిగిన రైతులు సైతం యంత్ర పరికరాలు కలిగిఉండి సాగును ప్రోత్సహించడం, గ్రామాల్లో కస్టం హైరింగ్ సెంటర్లు (వ్యవసాయ పనిముట్లను అద్దెకు ఇచ్చే సంస్థ) ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నాయి.



జిల్లా కేటాయించిన యంత్రాలు, పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నారు.

అర్హతలు ఇవీ..

రూ.లక్షకు పైగా విలువ చేసే యంత్రం పొందగోరే రైతు ఎకరం, రూ.లక్షలోపు విలువ చేసే యంత్రానికి ఎకరం లోపు భూమి కలిగి ఉండాలి. సీహెచ్‌సీలోని సభ్యుల(ఐదుగురు)కు కనీసం 2.5 ఎకరాలు ఉండాలి. సభ్యులు ఒకే కుటుంబానికి చెందిన వారై ఉండకూడదు.

నాలుగు కేటగిరీల కింద మంజూరైన పరికరాలు

పంటలను రక్షించేవి : బ్యాటరీతో నడిచే, కాలుతో తొక్కే యంత్రాలు 1,291, కాలుతో తొక్కేవి, చేతితో స్ప్రే,పెట్రోల్‌తో నడిచే పంపులు 206
ట్రాక్టర్ పరికరాలు : రోటోవేటర్లు 63, విత్తనాలు, ఎరువులు వేసే పరికరం 17, కల్టివేటర్లు, ప్లవ్‌లు, కేజ్ వీల్స్ 61, వరాలు తీసే పరికరం (పీటీఓ) 4, నాన్ పీటీఓ 4
రైతు స్వయంగా ఆపరేట్ చేసేవి : పవర్ వీడర్ 8, బ్రష్‌కట్టర్ 17, పవర్ టిల్లర్ 12
కోతకోయడానికి : గడ్డికట్టలు కట్టే యంత్రం 18 యూనిట్‌లు మంజూరయ్యాయి.

ఆగస్టు 15వరకు ఆమోదిస్తేనే..

వ్యవసాయ విస్తరణ అధికారులు ధరఖాస్తులు స్వీకరించి, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఎఫ్ఎం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆగస్టు 5వ తేదీలోగా లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి. ఎంపిక కమిటీ ఆగస్టు 15వరకు జిల్లాస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి ఆమోదించవలసి ఉంటుంది.

వైభవంగా నవకలశ స్నపనం, చందనగోష్టి



ఆండాళ్ దేవికి నవకలశ స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు



శివాలయంలో స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 26నుంచి మూడు రోజులుగా జరుగుతున్న ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. సోమవారం ఉదయం అమ్మవారికి నవకలశ స్నపనం చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, పారాయణికులు పఠనాలు పఠిస్తులండగా అమ్మవారికి చందన గోష్టి చేశారు. అనంతరం పలురకాల ప్రసాదాలను నైవేద్యం సమర్పించి ఉత్సవాలకు ముగింపు పలికారు.

శివుడికి సంప్రదాయ పూజలు

యాదగిరి కొండపై ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారంగా చేపట్టారు. స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు ఆలయ ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో వేకువజామున సుప్రభాత సేవ, గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజావాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్

అమల్లోకి ఫేస్ రికగ్నేషన్

- నూతన విధానంతో మొదటి రోజు ఆరుగురికి పింఛన్లు పంపిణీ
- నేటి నుంచి పూర్తిస్థాయిలో..
- బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడనివారికి తొలగనున్న ఇబ్బందులు

భువనగిరి: బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడని చేయూత లబ్ధిదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. ఇకనుంచి ఫేస్ రికగ్నేషన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నారు.రాష్ట్రం ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఈ విధానం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 99,287 మంది చేయూత లబ్ధిదారులు ఉండగా మొదటి రోజు పోస్టాఫీసుల్లో ఆరుగురికి ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రత్యేకంగా మిత్ర యాప్

పింఛన్లు తీసుకునే సమయంలో బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్రలు పడక వృద్ధులు ఇబ్బందులు పడేవారు. ఇటువంటి వారికి పంచాయతీ కార్యదర్శి వేలిముద్రలు తీసుకుని పింఛన్ అందజేసేవారు. దీనివల్ల పింఛన్ల పంపిణీ అలస్యం అయ్యేది. ప్రస్తుతం ముఖ గుర్తింపు విధానం అమలు చేయడం వల్ల సులభంగా, నేరుగా పింఛన్ పొందనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మిత్ర యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను పోస్టల్ ఉద్యోగుల సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేశారు. ఈ యాప్ ద్వారా లబ్ధిదారు ముఖాన్ని ఫొటో తీసి ఆధార్ అనుసంధానంగా ఉన్న ఫొటోను సరిచూసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.



రామన్నపేట పోస్టాఫీస్‌లో మిత్ర యాప్‌తో చేయూత లబ్ధిదారు ఫొటో తీస్తున్న ఉద్యోగి

అక్రమాలకు అడ్డుకట్ట

జిల్లా వ్యాప్తంగా 99,287 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో చాలావరకు పోస్టాఫీస్‌ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. వేలిముద్రలు పడనివారు, అనారోగ్యంతో మంచానికి పరిమితమైన లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రల సహాయంతో పింఛన్ పంపిణీ చేస్తున్నారు. దీని వల్ల అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో పారదర్శకత ఉండేలా ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ విధానం తీసుకువచ్చింది. నూతన విధానాన్ని జిల్లాలోని అన్ని పోస్టల్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు.

పారదర్శకత ఉంటుంది

చేయూత లబ్ధిదారులకు ఫేస్ రికగ్నేషన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేసే విధానాన్ని జిల్లాలో సోమవారం అమల్లోకి తీసుకువచ్చాం. నేటి నుంచి నూతన విధానంతోనే పింఛన్ల పంపిణీ ఉంటుంది. ఇందుకోసం పోస్టల్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే కొందరి సెల్‌ఫోన్లలో మిత్ర యాప్ ఇన్‌స్టాల్ చేశాం. నూతన విధానం వల్ల పింఛన్ డబ్బుల పంపిణీలో పారదర్శకత ఉంటుంది. అక్రమాలకు తావుండదు.

–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

వెలవెలబోయిన యాదగిరీశుడి సన్నిధి

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రాక గణనీయంగా తగ్గింది. ఎప్పుడు భక్తులతో కిటకిటలాడే ఆలయం.. శ్రావణ మాసం మొదటి సోమవారం భక్తులు లేక వెలవెలబోయింది. ఆలయ మండపాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తులు లేక నిర్మానుష్యంగా కనిపించింది.

– యాదగిరిగుట్ట



ఉదయం 8గంటల సమయంలో భక్తులు లేక వెలవెలబోతున్న ఆలయ మాడ వీధులు



భక్తులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న వీఐపీ క్యూలైన్

రెండు ఇళ్లలో చోరీ

హుజూర్‌నగర్: తాళం వేసిన రెండు ఇళ్లలో బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామపంచాయతీ పరిధిలోని కల్మేట్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన బాణావత్ వెంకటి, భూక్యా సైదాలు వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళాలు వేసి పొలం పనులకు వెళ్లారు. తిరిగి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. బంగారం, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాణావత్ వెంకటి ఇంట్లో 9 తులాల బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదు, భూక్యా సైదా ఇంట్లో రూ.15వేల నగదు చోరీకి గురైంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేష్ తెలిపారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

పెన్‌పహాడ్: మండల పరిధిలోని మేగ్యాతండా ఆవాసం కేవ్లాతండాకు చెందిన చెందిన లకావత్ లక్ప్తి సోమవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో డబ్బాలో ఉన్న తులంన్నర బంగారు చైను, ఉంగరంతోపాటు కొంత నగదు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

నగదు అపహరించిన ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరొకరు
- రూ.4లక్షల నగదు, కారు, బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

చౌటుప్పల్ : సెకండ్‌హ్యాండ్‌లో కారు కొనేందుకని ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన నలుగురితో కలిసి చౌటుప్పల్‌కు వెళ్లగా అతను వెంట తెచ్చుకున్న నగదును వారు అపహరించుకుపోయారు. ఈ ఘటన ఈనెల 26న చౌటుప్పల్ పట్టణంలో చోటుచేసుకోగా.. ముగ్గురు నిందితులు సోమవారం పోలీసులకు చిక్కారు. ఒకరు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను సీఐ మన్మథకుమార్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాగోల్‌కు చెందిన వీరగంధం శ్రీనివాస్ అనే వ్యక్తి సెకండ్ హ్యాండ్‌లో కార్లు కొనడం, అమ్మడం చేస్తుంటాడు. గత 20రోజుల క్రితం సెకండ్‌హ్యాండ్‌లో కార్లు కొనబడును, అమ్మబడును అని తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్ట్ చేశాడు. ఆ పోస్టును చూసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వేముల పుల్లారావు అలియాస్ శివ(38), కర్నూలు జిల్లా కల్లూరు మండలం శరీన్‌నగర్‌కు చెందిన కర్వాల సునీల్‌కుమార్(45), పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మిద్దె జగదీష్‌బాబు(46)తోపాటు బత్తుల సాంబశివరావు అనే వ్యక్తులు శ్రీనివాస్‌ను సంప్రదించారు. తమ వద్ద సెకండ్‌హ్యాండ్ కార్లు ఉన్నాయని, కావాలంటే చూపిస్తామని శ్రీనివాస్‌ను నమ్మబలికారు. అతను చేసేది అదే వ్యాపారం అయినందున కారు కొనుగోలుకు చేసేందుకు సిద్ధమేనని శ్రీనివాస్ వారితో చెప్పాడు.

అందరూ కలిసి అద్దె కారులో చౌటుప్పల్‌కు..

సెకండ్‌హ్యాండ్‌లో కారును శ్రీనివాస్‌కు ఇప్పించేందుకుగాను పుల్లారావు, సునీల్‌కుమార్, జగదీష్‌బాబు, సాంబశివరావులు కలిసి ఈనెల 26న అద్దెకారులో నాగోల్‌కు చేరుకున్నారు. శ్రీనివాస్‌ను తమ వెంటబెట్టుకొని చౌటుప్పల్ పట్టణంలోని చిన్నకొండూర్‌రోడ్డులో ఉన్న మసీదు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అమ్మకానికి ఉన్న ఓ సెకండ్‌హ్యాండ్ కారును చూపించారు. సంబంధిత కారు యజమాని కొద్దిసేపటి తర్వాత వస్తానని చెప్పడంతో వీరంతా అద్దెకు తీసుకువచ్చిన కారులోనే కూర్చున్నారు. ఇంతలోనే శ్రీనివాస్‌కు ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ కారు దిగి బయటకు వెళ్లాడు. శ్రీనివాస్ తెచ్చిన రూ.4లక్షలు కారు డ్యాష్‌బోర్డులో ఉండగా.. ఇదే అదునుగా భావించిన మిగతా నలుగురు నిందితులు నగదును తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. కొంత సేపటి తర్వాత శ్రీనివాస్ రాగా.. వీరు కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సీఐ మన్మథకుమార్ విచారణ చేపట్టారు. ఆ క్రమంలో ధర్మోజిగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు నిందితులు పోలీసులకు చిక్కారు. వారి వద్ద రూ.4లక్షల నగదు, అద్దె కారు, 5గ్రాముల బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బత్తుల సాంబశివరావు అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. నిందితులంతా గతంలో దొంగనోట్లు, దొంగ బంగారం కేసుల్లో వివిధ ప్రాంతాల్లో అరెస్ట్ అయ్యారని చెప్పారు.

నవనీత.. సాగులో ఘనత

రెండు ఎకరాల విస్తీర్ణంలో అద్భుతాలు

- పాలీహౌస్‌లలో సేంద్రియ పద్ధతుల్లో కీర సాగు
- కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు, మరో పది మందికి ఉపాధి
- ఆదర్శంగా నిలుస్తున్న పంగాల నవనీత



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న కీరదోసకాయలు

తుర్కపల్లి : ఆమె సాధారణ గృహిణి. వ్యవసాయంపై ఉన్న మక్కువతో సేద్యంలోకి అడుగుపెట్టింది. పాలిహౌస్‌లు ఏర్పాటు చేసి ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట పండించి.. ఇప్పుడు కీరదోస సాగు చేస్తోంది. సేంద్రియ పద్ధతుల్లో మంచి దిగుబడి సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునందించడమే కాకుండా మరో పది మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. పంగాల నవనీత.

ఎకరాకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు

ఏడాదికి రెండు విడతల్లో కీరదోస పండిస్తున్నారు. పంట వేసిన అనంతరం 25 రోజుల తరువాత కాత మొదలవుతుంది. ప్రతి రెండు, మూడు రోజులకోమారు దిగుబడి వస్తుంది. ఒక్క కాతకు 500 నుంచి 600 కిలోల దిగుబడి వస్తుంది. పెట్టుబడి ఎకరాకు రూ.1.5 లక్షలు అవుతుంది. పెట్టుబడి, కూలీల ఖర్చులు పోనూ ఎకరానికి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు లాభాలు పొందుతున్నారు.

పాడిపంట

లాభాలు తగ్గడంతో కీరదోస వైపు దృష్టి

ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్ అమ్మకాలకు మార్కెటింగ్ పరంగా ఇబ్బందులు ఎదురవుతుండటం.. పెట్టుబడి, రవాణా ఖర్చులు పెరిగిపోవడంతో లాభాలు తగ్గాయి. దీంతో వాటిని తొలగించి ఆ స్థానంలో ఏడాది క్రితం కీరదోస సాగు ప్రారంభించారు. రెండు ఎకరాల్లోని పాలిహౌస్‌ల్లో కీరదోస సాగు చేస్తున్నారు.

స్థానిక మార్కెట్‌లతో పాటు హైదరాబాద్‌కు ఎగుమతి

పండిన కీరదోసను భువనగిరితో పాటు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి తదితర ప్రధాన మార్కెట్‌లకు తరలిస్తుంటారు. కిలోకు రూ.25నుంచి 30 వరకు ధర పలుకుతుందని.. పెట్టుబడి, రవాణా ఖర్చులు, మార్కెట్‌ను ముందుగానే అంచనా వేసుకుని సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందగలుగుతున్నామని మహిళా రైతు నవనీత చెబుతున్నారు.

సేంద్రియ పద్ధతుల్లో సాగు

కీరదోస సాగులో ఆవుపేడతో పాటు ఇతర సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చాలా మంది వ్యాపారులు తోట వద్దకు వచ్చి ఆర్డర్ ఇచ్చి వెళ్తుంటారని నవనీత చెబుతున్నారు. అంతేకాకుండా నీటి వినియోగం చాలా తక్కువగా ఉంటుందని అంటున్నారు.



ఎక్కువ లాభాలు గడించవచ్చు

కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నందుకు గర్వకారణంగా ఉంది. సేద్యంపై నేను చూపుతున్న శ్రద్ధ ఇతర మహిళలు, రైతులకు స్ఫూర్తిదాయకంగా మారుతుంది. ఏ సాగులోనైనా ఆధునిక, సేంద్రియ పద్ధతులు అవలంబించడం వల్ల తక్కువ భూమిలోనూ ఎక్కువ లాభాలు గడించవచ్చు. సాగులో నా భర్త సహకారం ఎంతో ఉంది.

– నవనీత, మహిళా రైతు



మొదట్లో క్యాప్సికమ్, చెర్రీ టమాట, కాలిఫ్లవర్ సాగు

తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పంగాల నవనీత ఐదేళ్లుగా సాగులో రాణిస్తోంది. ఆమె భర్త బాలస్వామి వృత్తిరీత్యా ప్రైవేట్ అధ్యాపకుడు. వీరికి ఇద్దరు సంతానం. నవనీతకు వ్యవసాయం అంటే మొదటి నుంచి మక్కువ. వారికున్న నాలుగు ఎకరాల్లో సంప్రదాయ పంటలు సాగు చేస్తుండేవారు. ఆ పంటల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా సొంత ఖర్చులతో రెండు ఎకరాల్లో ఐదేళ్ల క్రితం రెండు పాలిహౌస్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్, దోసకాయ పండించేవారు. ఇందులో ఎరుపు, పసుపు క్యాప్సికంను హైదరాబాద్, బెంగళూర్, ముంబయికి ఎగుమతి చేసేవారు. చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్‌ను స్థానిక మార్కెట్‌లతో పాటు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు తరలించేవారు.

అనుమానితులపై కేసు నమోదు

తిరుమలగిరి: మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే మందుల సామేల్ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పంచాయతీ కార్యదర్శి గిలకత్తుల సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుంగతుర్తి సీఐ నర్సింహారావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు సంఘటన స్థలాన్ని సోమవారం సందర్శించారు. అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్వరలోనే శిలాఫలకం ధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

తల్లి ఫిర్యాదు.. కుమారులపై కేసు

మునగాల: మండల కేంద్రానికి చెందిన సుంకర భద్రమ్మ అనే వృద్ధురాలు తన ఇద్దరు కుమారులు పోషణ చూడకపోవడంతో మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. భద్రమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. భద్రమ్మ భర్త సైదులు 2013లో అనారోగ్యానికి గురై మృతిచెందాడు. దీంతో భద్రమ్మ అవివాహితుడైన మూడవ కుమారుడు నాగయ్య వద్ద ఉంటుంది. ఇతను దివ్యాంగుడు. దీంతో భద్రమ్మ పోషణ నాగయ్యకు భారం కావడంతో మిగతా ఇద్దరు కుమారులు వెంకన్న, అంజయ్యలు జీవనభృతి ఇవ్వాలని కోదాడ ఆర్డీఓను ఆశ్రయించింది. స్పందించిన ఆయన భద్రమ్మ జీవనం కోసం ముగ్గురు కుమారులు నెల, నెలా రూ.2వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఆదేశించారు. మూడవ కుమారుడు తల్లి ఖాతాలో నగదు జమ చేస్తున్నప్పటికీ మిగతా ఇద్దరు కుమారులు వెంకన్న, అంజయ్య నిర్లక్ష్యం చేయడంతో భద్రమ్మ తిరిగి మునగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోదాడ ఆర్డీఓ ఆదేశాల మేరకు వెంకన్న, అంజయ్యలపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం

మోత్కూరు: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మోత్కూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోత్కూరు మండలం దత్తపడూడెం గ్రామానికి చెందిన కుంచపు వెంకటేష్(42) నెలన్నరగా పనికి వెళ్లకుండా ఉంట్లోనే ఉంటున్నాడు. ఈనెల 27న ఉదయం 9గంటలకు అతడి భార్య కుంచపు విజయ పనికి వెళ్లేటప్పుడు, భర్త వెంకటేష్‌ను తనతో రావాలని కోరినా వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. భార్య సాయంత్రం 6.30గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి వెంకటేష్ కనిపించలేదు. ఈవిషయమై కుమారుడిని ఆమె అడుగగా సాయంత్రం 4గంటలకే బయటకు వెళ్లినట్లు చెప్పాడు. ఆమె చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగయ్య (ఫైల్)

త్రిపురారం : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన త్రిపురారం మండలంలోని కామారెడ్డిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిగూడేనికి చెందిన గుండెబోయిన నాగయ్య(50) మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామంలోని ఓ వైన్‌షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం నాగయ్య భార్య చెరువుగట్టుకు వెళ్లగా నాగయ్య ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. సోమవారం ఉదయం నాగయ్య వైన్ షాపునకు వెళ్లకపోవడంతో షాపు నుంచి అతడికి ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో ఇంటి సమీపంలోని వారికి ఫోన్ చేసి నాగయ్య దగ్గరికి వెళ్లమని చెప్పారు. వారు వెళ్లి చూడగా అతను అపస్మారకస్థితిలో కనిపించాడు. గ్రామస్తులు స్థానిక ఆర్ఎంపీ డాక్టర్‌కు సమాచారం అందించారు. నాగయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. మృతుడి భార్య గుండెబోయిన నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

పెన్‌పహాడ్: గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారయ్యారు. ఈ సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన కొంచెం సాయిగణేష్, శాంతినగర్‌కు చెందిన పవన్, అమరగాని లోకేష్‌లు గంజాయికి అలవాటుపడ్డారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు వద్ద గంజాయి కొనుగోలు చేసి వారు తాగడంతో పాటు కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నారు. అనంతారం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు పోలీసులను చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి పోలీసులు వారి స్కూటీని ఆపి తనిఖీ చేశారు. కొంచెం సాయిగణేష్ వద్ద 100గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పవన్, లోకేష్‌లు పరారయ్యారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథ వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించిన యువకుడు



అనాథ వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పిస్తున్న ప్రవీణ్

మునగాల: అనాథ వృద్ధుడిని అనాథాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నాడు ఓ యువకుడు. మునగాల మండల కేంద్రంలో మసీద్ ఎదురుగా ఉన్న దుకాణాల ముందు వారం రోజులుగా అనాథ వృద్ధుడు సంచరిస్తున్నాడు. మసీద్ కాంప్లెక్స్‌లోని బైక్ షోరూంలో విధులు నిర్వర్తిస్తున్న పొన్నాల ప్రవీణ్ అనే యువకుడు అనాథ వృద్ధుడి పరిస్థితికి చలించిపోయి మూడు రోజులుగా ఆహారం అందిస్తున్నాడు. వృద్ధుడు మూగవాడు కావడంతో అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించాడు. ఈ విషయం సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ప్రవీణ్‌ను పలువురు అభినందించారు.

మైనర్‌ను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

నల్లగొండ: మైనర్‌ను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి ఎస్. రోజారమణి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చింతపల్లి మండలానికి చెందిన గోరటి అనిల్ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించాడు. విషయం తల్లితండ్రులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఛార్జీ షీటు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎస్. రోజారమణి నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బాలికను వేధించిన కేసులో మూడున్నరేళ్ల జైలు

చింతపల్లి: ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో నిందితుడికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు చింతపల్లి ఎస్ఐ ముత్యాల రాంమూర్తి సోమవారం తెలిపారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018లో గిరిక అనిల్ అనే ఒక యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి చింతపల్లి ఎస్ఐ నాగభూషణ్‌రావు కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పీపీ వేముల రంజిత్ కుమార్ వాదనలతో ఏకీభించిన కోర్టు నిందితుడికి 3సంవత్సరాల 6నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పునిచ్చింది. కేసులో సరైన ఆధారాలు సేకరించిన అప్పటి ఎస్ఐ నాగభూషణ్ రావు, ప్రస్తుత నాంపల్లి సీఐ రాజు, ఎస్ఐ రాంమూర్తి తోపాటు సీడీఓ వెంకట కృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, నరేందర్, మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- మనస్థాపంతో సెల్‌టవర్ ఎక్కిన భర్త

చిట్యాల: భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలతో మనస్థాపానికి గురైన భర్త సెల్ టవర్ ఎక్కాడు. ఈ సంఘటన చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టంపల్లి గ్రామానికి చెందిన అంతటి ఉపేందర్(40)కు మునుగోడు మండలం క్రిష్టపురం గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపేందర్ హైదరాబాద్‌లో స్టీల్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పిట్టంపల్లి గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదం రావడంతో మనస్థాపానికి గురైన ఉపేందర్ తన ఇంటి సమీపంలోని సెల్ టవర్ ఎక్కాడు. గ్రామస్తులు సర్దిచెప్పడంతో కిందకు దిగాడు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని వంకమామిడి గ్రామంలో పిచ్చికుక్కలు ముగ్గురు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి శైలజ ఆదివారం బోనాల పండుగకు తన తల్లిగారి గ్రామం వంకమామిడికి వచ్చింది. కాగా శైలజ కుమారుడు చింటు సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుండగా రెండు పిచ్చికుక్కలు అతనిపై దాడి చేసి కణతభాగాన్ని కొరికాయి. కేకలు విని తల్లి పరుగెత్తుకుంటూ రాగా కుక్కలు ఆమెపైనా దాడికి యత్నించాయి. అక్కడే ఉన్న మరికొందరు వాటిని రాళ్లతో తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని నీలోఫర్‌కు తీసుకెళ్లారు. పిచ్చికుక్కలు కొద్దిసేపటికే చికెన్ సెంటర్ నిర్వాహకుడు షానుర్‌బాబా కుమార్తె ఆయేషాతో పాటు నకిరేకంటి నర్సింహ కొడుకును సైతం కరిచి గాయపర్చాయి. అంతటితో ఆగకుండా పలు కుక్కలపై దాడిచేసి గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు.

పన్నెండున్నర గంటల్లో 100కి.మీ పరుగు పందెం పూర్తి



ట్రోఫీ అందుకుంటున్న కిషన్

వలిగొండ : మహారాష్ట్రలోని భారమతి రన్నింగ్ సొసైటీ ఆదివారం పూణే నుంచి భారమతి వరకు నిర్వహించిన 100 కిలోమీటర్ల ఆరోగ్య పరుగు పందెం పోటీల్లో మండలంలోని ప్రొద్దటూరుకు చెందిన దుబ్బ కిషన్ పాల్గొన్నారు. 12:30 గంటల్లో పరుగు పందెం పూర్తి ట్రోఫీ తో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రస్తుతం కిశన్ ఇంటెలిజెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఆదివారం ఉదయం 4 గంటలకు ప్రారంభించిన పరుగు పందెం సాయంత్రం 4:30 గంటలకు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై శ్రద్ధ పెట్టాలన్నారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు సాగునీటి విడుదల చేసేందుకు వెంటనే షెడ్యూల్ ప్రకటించాలన్నారు. నిరంతరం సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసి పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

కొంగలు వాలవు ఇక..

రామన్నపేట: వరి చేలను కొంగలు, పిట్టలు తొక్కి పాడు చేయకుండా రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన యాదయ్య అనే రైతు వినూత్న ప్రయోగం చేశాడు. ఇనుప చువ్వకు బిగించిన సైకిల్‌హబ్‌కు కూలర్ ఫ్యాన్‌ను ఏర్పాటు చేసి గాలికి తిరిగేలా చేశాడు. గాలికి ఫ్యాన్ తిరుగుతూ దానికి అమర్చిన పళ్లెంను తాకుతుండడంతో శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి పిట్టలు, కొంగలు వాలకుండా దూరంగా పోతున్నాయి.

వెల్లంకిలో యాదయ్య ఏర్పాటు చేసిన పరికరం

